క్లుప్తంగా

30లోపు పంట నమోదు చేయించుకోవాలి

పెదకాకాని: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈ నెల 30 తేదీలోగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి పి.సంధ్యారాణి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వెళ్లి ఎంత విస్తీర్ణంలో, ఏ పంటలు సాగు చేస్తున్నారో నమోదు చేయాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్‌తో పంటల బీమా, రైతు భరోసా, రాయితీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు.

ఎమ్మార్పీఎస్ మహా దీక్ష



చేబ్రోలు: ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు చేబ్రోలులో మంగళవారం మహా దీక్ష చేపట్టారు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో అన్ని ప్రాంతాల్లో నిర్వధిక దీక్షా శిబిరాలు నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మురికిపూడి హృదయ రాజు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించేందుకు సర్వశక్తులు వడ్డి, పోరాడాలని అనుబంధ సంఘాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందా వెంకటేశ్వర్లు, డేగల బాబు, వెంకటేష్, కోడూరు సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

సైకిల్‌ను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

నగరం: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన నగరంలోని ఎస్వీఆర్ఎం కళాశాల ఎదుట మంగళవారం జరిగింది. ఎస్ఐ రామకృష్ణ సమాచారం మేరకు మెరుగుపాల వెంకటేశ్వరావు (77) నగరం నుంచి ముత్తుపల్లికి సైకిల్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం అతనిని ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వరావు తలకు తీవ్ర గాయమవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని నగరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి, తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.ఈ మేరకు.. ఎస్ఐ రామకృష్ణ విచారణ చేపట్టారు. నగరం మండలం వీరంకివారిపాలేనికి చెందిన మన్నెం సాయికృష్ణ ప్రమాదానికి కారకుడని గుర్తించారు.అతనిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్పిన్నింగ్ మిల్‌పై నుంచి పడి కార్మికుడి మృతి



గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ పైనుంచి జారిపడి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సాకు చెందిన గోపాల్ ప్రధాన్(22) చౌడవరం గ్రామంలోని బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడుగా చేరాడు. మిల్లులో పై ఫ్లోర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలవ్వగా తోటి కార్మికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఘటనపై మృతుని తండ్రి దుర్యోధన్ ప్రధాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి మృతి

పెదకాకాని: గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గోళ్ళమూడి గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని గోళ్ళమూడి గ్రామానికి చెందిన చెన్నం గోపీ ఈ నెల 8న పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతనిని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గోపీ(23) మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పానుకుమాలి శివకుమార్, రాధ(63) దంపతులు నివసిస్తున్నారు. సోమవారం ఉదయం టీ పెట్టేందుకు వెళ్లిన ఆమెకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని మరో వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీడా మైదానంలో పతకాల పంట

- ఫుట్‌బాల్, రగ్బీలో రాణిస్తున్న విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి జట్లకు ప్రాతినిధ్యం
- ఆదర్శంగా నిలుస్తున్న 'ఉప్పలపాడు' పాఠశాల



ఫుట్ బాల్‌లో రాణించిన విద్యార్థినులతో హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు

పెదకాకాని: క్రీడా మైదానంలో పతకాల పంట పండిస్తున్నారు ఆ పాఠశాల విద్యార్థులు. గ్రౌండ్‌లో పాదరసంలా కదులుతూ..రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు అత్యధికంగా ఎంపికవుతున్నారు. రగ్బీలోనూ ఓ పట్టుపడుతూ.. తమ బలమేంటో చూపిస్తున్నారు. 2022–23 సంవత్సరానికి గాను ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కార అవార్డుల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారు. మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ.. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని గత ఆగస్టు 29న జిల్లా విద్యాశాకాధికారి, సెప్టెంబరు 1న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. చదువులో రాణించడంతో పాటు ప్రధానోపాధ్యాయుడు మైనేని నాగేశ్వరరావు ప్రోత్సాహంతో వ్యాయామోపాధ్యాయుడు చంద్ర వినయ్‌కుమార్ శిక్షణలో క్రీడా మెళకువలు నేర్చుకుంటున్నారు. గతేడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీటీ) పోటీల్లో ప్రతిభ కనపరచిన నలుగురు విద్యార్థులు ఫుట్‌బాల్, రగ్బీలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



త్రో బాల్‌లో విద్యార్థినులకు శిక్షణ

గతేడాది కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్–14 బాలికల విభాగంలో 11 మంది క్రీడాకారులుండే జిల్లా జట్టు ఏడుగురు ఉప్పలపాడు పాఠశాల విద్యార్థులే ఉండటం గమనార్హం. ఆ పోటీల్లో జిల్లా జట్టును ద్వితీయ స్థానంలో వారు నిలబెట్టారు.

ఫుట్‌బాల్, రగ్బీ రాష్ట్ర జట్లకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్ పోటీలకూ విద్యార్థులను తీర్చిదిద్దుతూ.. పతకాల పంట సాధిస్తున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి..



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. నేను కూడా బాల్ బాడ్మింటన్ క్రీడాకారుడినే. అందుకే క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. అదనపు తరగతులతో చదువులో రాణించేలా చూస్తున్నాం.

– మైనేని నాగేశ్వరరావు, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, ఉప్పలపాడు.

తల్లిదండ్రులు సహకరిస్తున్నారు..



విద్యార్థులను క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నాం. వారి తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో రాణించి, రాష్ట్ర జట్లకు 19 మంది బాలికలు, 13 మంది బాలురు ఎంపికయ్యారు. ఐదు క్రీడా పోటీల్లో పాల్గొనడం జరిగింది. క్రీడా ప్రతిభా పురస్కార అవార్డుల ప్రదానంలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది.

– చంద్ర వినయ్‌కుమార్, పీఈటీ, జెడ్పీ హైస్కూల్, ఉప్పలపాడు.

నగరంలో పోలింగ్ కేంద్రాల మార్పు

కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి అభిప్రాయాలను తెలియజేయాలని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్, పోలింగ్ కేంద్రాల మార్పుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలననుసరించి గుంటూరు నగరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగరపాలక సంస్థ అధికారులు కొన్ని కేంద్రాల చిరునామా, మరి కొన్ని కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదించారని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్‌లను పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. కొన్ని కేంద్రాలు నాడు– నేడు పనుల వలన, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కొనసాగించకపోవడం వలన కేంద్రాలను పూర్తిగా మార్పు చేస్తున్నామని వివరించారు. మరి కొన్ని కేంద్రాల పేర్లు సరి చేశామని పేర్కొన్నారు. తూర్పులో 96, పశ్చిమలో 49 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మార్చడానికి, తూర్పులో 52, పశ్చిమలో 38 కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రెండు రోజుల్లో కేంద్రాలపై అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. అనంతరం నివేదిక జిల్లా ఎన్నికల అధికారికి పంపుతామని చెప్పారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, కోటయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, రాజకీయ పార్టీల నుంచి బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి సిహెచ్.వాసు, సీపీఎం ఖాసిం షహీద్, తెలుగుదేశం పార్టీ ఎస్.ఓంకార్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు వేగంగా రుణాలు మంజూరు చేయాలి

నెహ్రూనగర్: టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాల మంజూరు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం టిడ్కో లబ్ధిదారులకు రుణాల మంజూరుపై బ్యాంకర్లు, మెప్మా సీఎంఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలో టిడ్కో గృహ సముదాయాలను కేటాయించిన లబ్ధిదారులకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపి రుణాలు మంజూరు వేగంగా చేయాలని కోరారు. కొంత మంది లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో రుణాల మంజూరు నిలిపివేశారని, అటువంటి వారికి కూడా పునః పరిశీలన చేసి రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం త్వరలో టిడ్కో ఇళ్ల ప్రారంభం చేయనున్నదని, మెప్మా సిఎంఎంలు ప్రతి లబ్ధిదారుల నుండి రుణాల కోసం డాక్యుమెంట్స్‌ని సేకరించి బ్యాంక్‌లకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిధర్ రెడ్డి, ఉపా సెల్ పి.ఓ. సాంబశివరావు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దారు రవిబాబు

తెనాలిరూరల్: నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వే తెనాలి పట్టణం, మండలంలోనూ కొనసాగుతోందని, ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ కె. రవిబాబు కోరారు. స్థానిక కొత్తపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు సమావేశంలో పాల్గొని తెనాలి మండలంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వే గురించి చర్చించారు. పలువురు నాయకులు వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవిబాబు, సుబ్బారావు మాట్లాడుతూ, సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమం తెనాలిలో జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని 273 పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఎల్‌వోలు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారని తెలిపారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. కొత్తగా ఓట్లు నమోదు, ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు బీఎల్‌వోలు గుర్తించాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వోలతో పాటు పార్టీల నుండి బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటి సర్వేలో పాల్గొనవచ్చని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏమైనా సందేహాలు/సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోల ఆకస్మిక తనిఖీలు



పరిమితికి మించి ప్రయాణికులున్న ఆటోను పట్టుకున్న రవాణా అధికారులు

పట్నంబజారు: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై మంగళవారం ఆర్టీఓ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన ''ప్రయాణికుల ప్రాణాలు.. గాలిలో దీపాలు'' అనే కథనానికి రవాణా శాఖ అధికారులు స్పందించారు. డీటీసీ షేక్ కరీం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి అధికంగా ప్రయాణికులు ఉన్న ఆటోలపై ఆరు కేసులు, ఫిట్‌నెస్, పర్మిట్ లేకుండా తిరుగుతున్నవి 2, ప్రమాదకర పరిస్థితుల్లో డ్రైవింగ్ చేస్తున్నది 1, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్నవి 4, గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న 5 వాహనాలు కలిపి మొత్తం 18 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్ ఆటో ప్రయాణికులను తరలించకూడదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తామని, ఆటోల యాజమాన్యాలు, డ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.

'విజ్ఞాన్'లో చంద్రయాన్-3 విజయోత్సవ సదస్సు



గుంటూరు రూరల్: చంద్రయాన్–3 భారతీయుల విజయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు అన్నారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చంద్రయాన్–3 మిషన్ విజయోత్సవ సదస్సు మంగళవారం నిర్వహించారు. శాస్త్రవేత్తలకు, ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు. మిషన్ విషయాలను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పాతూర్ రాధిక, హెచ్ఓడీ సంధ్య, ప్రసన్న, గుంటూరు పశ్చిమ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ దండమూడి విజయ్, టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం, వ్యాయామంతో వ్యాధుల నుంచి విముక్తి



గుంటూరు ఎడ్యుకేషన్: పోషకాహారం, వ్యాయామం, మంచి నడవడికతో వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని త్రిగుణ హెల్త్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమా సుందరి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని జీఎస్ఆర్ మోడల్ స్కూల్లో పూణేలోని జాతీయ ప్రకృతి వైద్య సంస్థ ఆధ్వర్యంలో రోగయుక్త భారత్– ప్రకృతి వైద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ అమరేశ్వరరావు విద్యార్థులతో చిరు వ్యాయామం చేయించారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేసి, విద్యార్థులకు ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు జి.శివారెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి అమ్మవార్లకు అభిషేకార్చన

పాత గుంటూరు: అరండల్‌పేటలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా కోటి కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం గోపూజ, శ్రీ చక్ర మేరుకు అభిషేకాలు అనంతరం అష్టలక్ష్మీ అమ్మవార్లకు 108 కేజీల గంధంతో విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పంతో అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోటి కుంకుమార్చన ముగింపుగా బుధవారం లక్ష గాజుల పూజ, శాంతి హోమం మహా పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆశీర్వాదం, డాక్టర్ సునీత

వల్లభాపురం(కొల్లిపర): విద్యార్థులు ప్రతి రోజు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా వయసు పెరిగే కొద్దీ కంటి సమస్యలు రాకుండా ఉంటాయని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎం.ఆశీర్వాదం, డాక్టర్ సీహెచ్ సునీత అన్నారు. మంగళవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 120 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 13 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరికి త్వరలో ఉచితంగా కళ్ల జోళ్లు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, ఆశాకార్యకర్త ఎస్.సీతామహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

ప్రత్తిపాడు: పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా చినకోండ్రుపాడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ప్రీ–స్కూల్ ప్రాముఖ్యత, పోషకాహారంలో చిరుధాన్యాల పాత్రపై తల్లులకు వివరించారు. ప్రీస్కూలులో ఆట పాటల ద్వారా విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 పుస్తకాలను ప్రతిరోజూ పిల్లలతో రాయించడంతో మానసికవికాసం చెందుతారని తెలిపారు.

■ గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని బొర్రావారిపాలెంలో సూపర్ వైజర్ వి. అరుణ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పోషకాహారం, పెరటి తోటల పెంపకం, ఆహారంలో ఆకుకూరల వినియోగంపై తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, అంగన్‌వాడీ కార్యకర్త బి. శోభారాణి పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు

డీఈఓ శైలజ



సాంబశివరావును అభినందించిన డీఈఓ శైలజ, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవానంది నేషనల్ అవార్డ్స్–2023 అందుకున్న లాలుపురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు చివుకుల సాంబశివరావును తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సాంబశివరావు విజ్ఞానంతో వినోద కార్యక్రమాల ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షన్నర మంది విద్యార్థులకు మాథ్స్, సైన్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, జీవీఆర్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జిగా రామారావు



జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న డాక్టర్ రామారావు, పక్కన డాక్టర్ గురుప్రసాద్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగం ఇన్‌చార్జిగా డాక్టర్ పి.రామారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఇటీవల తనిఖీలు చేసిన సమయంలో కుటుంబ నియంత్రణ విభాగంలో ఇన్‌చార్జి లేకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్న విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో ఇన్‌చార్జి నియామకాన్ని చేపట్టారని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కోత, కుట్లు లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

రేడియాలజీ విభాగం తనిఖీ..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రేడియాలజీ విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. రేడియాలజీ ఓపీలో రోగులు ఎక్కువగా ఉండటాన్ని గమనించారు. ఆస్పత్రిలో రెండు స్కాన్ మిషన్‌లు నాలుగు ఎక్స్ రే మిషన్‌లు అందుబాటులో ఉన్నా రోగులు మాత్రం వందల సంఖ్యలో ఉండటంతో విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఒక పీజీ, ఒక రెసిడెంట్ వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉన్నారని ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఎక్స్ రే రిపోర్టులు వెంటనే చూడాల్సిన బాధ్యత అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉందని తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్ఎంఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

12 ఆటోలు.. రూ.65 వేలు

ప్రత్యేక డ్రైవ్‌గా ఆటోల తనిఖీ



ఆటోలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో ప్రసాద్, ఎంవీఐ రాఘవరావు

తెనాలిరూరల్: ప్రయాణికులను తరలించే ఆటోలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. తెనాలి పట్టణం, వడ్లమూడి, నారాకోడేరు వద్ద ఆటోలను ప్రాంతీయ రవాణా అధికారి ప్రసాద్, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు తమ సిబ్బందితో కలసి మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తించి అపరాధ రుసుం విధించారు. 12 వాహనాలకు కలిపి రూ. 65 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమే ఆటోలో ఎక్కించుకోవాలని డ్రైవర్ పక్కన వెనుక డోర్‌తెరచి విద్యార్థులను/ప్రయాణికులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టడం, డ్రైవర్ పక్కన కూర్చునే విధంగా ఏర్పాట్లు చేసిన ఆటోలను అవసరమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్‌బాక్సులు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడన్నారు. కొద్ది రోజుల పాటు ఆటోల తనిఖీ ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ జనార్ధనరావు



మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐలు

తెనాలిరూరల్: చవితి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత పోలీసు స్టేషన్ల నుండి అనుమతులు పొందాలని డీఎస్పీ బి.జనార్ధనరావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి సందర్భంగా మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా ఒక కమిటీగా ఏర్పడాలని, ఐదుగురు సభ్యుల గుర్తింపు కార్డులను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే తప్పనిసరిగా తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో వివరాలు సమర్పించి అనుమతులు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, ఫైర్ విభాగాల వారి వద్దా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, డీజే బాక్సులు పెట్టడం వంటివి చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం మండపాల వద్ద ఉండేలా చూసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు రూట్ మ్యాపును ముందుగా పోలీసులకు తెలపాలని మండపాల వద్ద, నిమజ్జనం రోజున ఊరేగింపు సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ సూచించారు. సమావేశంలో సీఐలు కె. శ్రీనివాసరెడ్డి, కె. చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు ఉన్నారు.

అచ్చంపేట ఎంఈఓగా అబ్దుల్ ఖుద్దూస్‌కు పోస్టింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా అచ్చంపేట ఎంఈఓ–1గా ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్‌కు పోస్టింగ్ ఇస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో గుంటూరు ఎంఈఓగా పని చేసిన ఖుద్దూస్‌పై శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసిన విషయం విదితమే. తాజాగా సస్పెన్షన్ ఎత్తివేసిన విద్యాశాఖాధికారులు ఆయనకు అచ్చంపేట మండల విద్యాశాఖాధికారి–1గా పోస్టింగ్ కల్పించారు.